క్లుప్తంగా

నేడు 20, 22 వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం

జగ్గయ్యపేట అర్బన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం 10 వ సచివాలయం పరిధిలోని 20, 22 వ వార్డుల్లో నిర్వహిస్తున్నామని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు అకుల శ్రీకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు వార్డులోని పెద్ద శివాలయం వద్ద నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఉదయభాను పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకుంటారని పేర్కొన్నారు.

నేడు ఆర్డీవో కార్యాలయంలో స్పందన

నందిగామ: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని ఆర్డీవో రవీంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. డివిజన్ పరిధిలోని మండలాల ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గ్రామాల్లో శానిటేషన్ పనులు

కంచికచర్ల: మండలంలోని పరిటాల, గండేపల్లి, చెవిటికల్లు, మోగులూరు, ఎస్ అమరవరం తదితర గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచులు ఆదివారం శానిటేషన్ పనులు చేపట్టారు. డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించటంతో పాటు దోమల నివారణ కోసం ఎబేట్‌ను పిచికారీ చేయించామని పరిటాల గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి కనగాల రవికుమార్ ఆదివారం తెలిపారు. అదేవిధంగా మండలంలోని గండేపల్లిలో కూడా దోమల నివారణ కోసం ఎబేట్‌ను పిచికారీ చేయించామని సర్పంచి బి.రవికుమార్ తెలిపారు.

నేడు స్పందన

కంచికచర్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని తహసీల్దార్ పబ్బారి శంకరబాబు ఆదివారం తెలిపారు. గ్రామాల్లోని సమస్యలుంటే ప్రజలు అర్జీల ద్వారా దఖలు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వచ్చిన అర్జీలను ప్రాధాన్యతాక్రమంలో త్వరితగతిన పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

నేడు సొసైటీ భవనం ప్రారంభం

వీరులపాడు(కంచికచర్ల): మండలంలోని జుజ్జూరు గ్రామంలో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక సహకార పరపతి సంఘం భవనంను సోమవారం ప్రారంభిస్తున్నామని సొసైటీ చైర్‌పర్సన్ పూలా రాంబాబు ఆదివారం తెలిపారు. భవనం ప్రారంభానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, కేడీసీసీ జిల్లా బ్యాంకు చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి పాల్గొంటారన్నారు. మండలంలోని పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు, కార్యదర్శులు పార్టీ నాయకులు పాల్గొనాలని కోరారు.

అమ్మవారి సేవలో తిరువూరు ఆర్డీవో



పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మవారిని ఆదివారం తిరువూరు ఆర్డీఓ లక్ష్మీప్రసన్న కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ అధికారులు ఆమెను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ తిరుమలేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు వీఎంసీ కార్యాలయాల్లో స్పందన

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని వివిధ ప్రాంతాల్లోని సమస్యల పరిష్కారానికి వీఎంసీ నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమం సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో జరుగుతుందని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని నగరవాసులు వినియోగించుకోవాలని కోరారు. వీఎంసీ ప్రధాన కార్యాలయం తోపాటు నగరంలోని మూడు సర్కిళ్లలో కూడా స్పందన జరుగుతుందని అధికారులు అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

దత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ఆదివారం శ్రీ ధర్మపరిషత్ మహాసంస్థాన్ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిగాయి. ఆలయంలోని శ్రీ శివకామేశ్వరికి శ్రావణ మాసం పురస్కరించుకుని కుంకుమార్చనలు, శ్రీచక్రార్చన, చండీ హోమం జరిగింది. నీలకంఠేశ్వరుడికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన ఘనత జగన్‌దే



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఉదయభాను



కార్యాలయం శంకుస్థాపనలో విప్ ఉదయభాను

ఎమ్మెల్యే ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, టీటీడీ పాలక వర్గ సభ్యులు సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలోని కోదాడ రోడ్డులో ఆదివారం సామినేని విశ్వనాథం కార్మికనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఏపీ పీటీడీ (ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్) ఎంప్లాయిస్ యూనియన్ భవనాన్ని ఉదయభాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక డిపో సెంటర్‌లో ఆర్టీసీ ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ భవనాన్ని ప్రారంభించుకోవడం సంతోషదాయకమని పేర్కొన్నారు. సభలు, సమావేశాలకు ఈ భవనం ఎంతగానో దోహదం చేస్తుందని చెప్పారు. త్వరలో జాతీయ రహదారిపై ఆటోనగర్ సమీపంలో నూతన ఆర్టీసీ బస్టాండ్‌ను ఏర్పాటుచేస్తామని పేర్కొన్నారు. కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కఠారి హరిబాబు, ఏపీ పీటీడీ రాష్ట్ర డెప్యూటీ జనరల్ సెక్రటరీ ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంకర్రావు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పసుపులేటి శ్రీనివాసరావు, పేట ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కల్యాణం కృష్ణారావు, ఆనంద్, రీజనల్ నాయకులు ఇమామ్ తదితర యూనియన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయ కార్యాలయానికి శంకుస్థాపన

పట్టణంలోని అద్దాలబజారులో వేంచేసియున్న మహాలక్ష్మి అమ్మవారికి వెండి దేవాలయం వద్ద నూతనంగా ఏర్పాటుచేయనున్న దేవాలయ కార్యాలయానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రావణమాసం ఆఖరి ఆదివారాన్ని పురస్కరించుకొని ఉదయభాను మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రం సుఖ శాంతులతో ఉండాలని, పాడి పంటలు బావుండాలని, వర్షాలు కురవాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం ఉదయభానును ఆలయ కమిటీ చైర్మన్ అత్తులూరి వెంకటేశ్వర్లు, సభ్యులు తదితరులు సన్మానించారు.

ఘనంగా శ్రీనివాస కల్యాణం

నందిగామ: పట్టణ శివారు పల్లగిరి గుట్టపై గల కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి శాంతి కల్యాణం ఆదివారం ఘనంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రాల నడుమ శ్రీనివాస కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆ తరువాత లోక శాంతిని కాంక్షిస్తూ పలు రకాల హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం జరిగింది.



స్వామివారి శాంతి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

రమేష్‌కు ఉత్తమ మోటివేషనల్ స్పీకర్ అవార్డు

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): ప్రభుత్వ విద్యాలయాల్లో స్ఫూర్తిదాయకమైన మోటివేషన్ చేస్తూ విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తున్న గ్రామానికి చెందిన కనకపూడి రమేషకు ఉత్తమ మోటివేషన్ స్పీకర్ అవార్డు వరించింది. రమేష్ మాట్లాడుతూ గంప నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నడుస్తున్న ఇంపాక్ట్ ఫౌండేషన్‌లో వ్యక్తిత్వ వికాస నైపుణ్యంలో శిక్షణ తీసుకుని శిక్షణ తరగతుల్లో మెంటార్‌గా వ్యవహరిస్తున్నారు. తాను చేస్తున్న సేవలకు గాను సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో మెగా ఇంపాక్ట్ సదస్సులో లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ చేతుల మీదుగా ఉత్తమ మోటివేషన్ స్పీకర్‌గా అవార్డు, సర్టిఫికెట్ అందుకోవటం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, కుటుంబసభ్యులు రమేష్‌కు అభినందనలు తెలిపారు.



జయప్రకాష్ నారాయణ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రమేష్

చవితి వేడుకలకు గణనాథులు సిద్ధం



వినాయక చవితి సమీపిస్తున్న నేపథ్యంలో వేడుకలకు విగ్రహాలు సిద్ధమయ్యాయి. పట్టణంలోని అనేక ప్రాంతాల్లో వినాయక విగ్రహాలను సిద్ధం చేశారు. ముఖ్యంగా నందిగామ పట్టణం అనేక ప్రాంతాలకు ప్రధాన వ్యాపార కూడలి. ఈ నేపథ్యంలో ఏటా వందలాది వినాయక విగ్రహాల విక్రయాలు జరుగుతుంటాయి. ఈ ఏడాది కూడా కొనుగోలుదారుల కోసం మూడు అడుగుల నుంచి 10 అడుగుల విగ్రహాలు సిద్ధమయ్యాయి. ఇప్పటికే పలుచోట్ల విగ్రహాలను కొనుగోలు చేసుకున్నారు. –నందిగామ

విశ్వనాథ రచనలు భావితరానికి స్ఫూర్తి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విశ్వనాథ రచనలు భావితరానికి స్ఫూర్తి అని వక్తలు తెలిపారు. ముత్యాలంపాడు శ్రీ అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయం వజ్రోత్సవాల్లో భాగంగా ఆదివారం జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతి కార్యక్రమం జరిగింది. మాజీ డెప్యూటీ మేయర్ సామంతపూడి నరసరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రంథాలయం ఉపాధ్యక్షుడు డి.సత్యనారాయణరాజు, కార్యదర్శి పీవీ సుబ్బరాజు, సాంస్కృతిక సంఘం అధ్యక్షులు వెంకటేశ్వరరాజు, డాక్టర్ ఎస్‌వీ సుబ్బరాజుతో కలిసి విశ్వనాథ సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ నేటి యువత విశ్వనాథ ఆశయ సాధనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కె. ప్రసాదరాజు, వి.సింగంరాజు, బాపిరాజు, టి.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.



విశ్వనాథ సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సమస్యకు.. చావు పరిష్కారం కాదు



మాట్లాడుతున్న డాక్టర్ ఆర్కే అయోధ్య



హాజరైన విద్యార్థులు

డాక్టర్ ఆర్‌కే అయోధ్య

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఏ సమస్యకు ఆత్మహత్యలు పరిష్కారం కాదని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఆర్‌కే అయోధ్య అన్నారు. కేబీఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు, కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణ దినోత్సవం పురస్కరించుకొని అవగాహన సదస్సును ఆ కళాశాల సెమినార్ హాల్లో ఆదివారం నిర్వహించారు. డాక్టర్ ఆర్‌కే అయోధ్య మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఇటీవల మానసిక ఒత్తిడులు అధికమయ్యాయన్నారు. ప్రతి గంటకు పదులు సంఖ్యలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తాము పనికిరాం అనే భావనతో ఉన్నవారు, నిరాశవాదం, నాకు ఎవరూ సాయం చేయరూ...? అనే భావనలతో ఉన్నవారు ఆ ఒత్తిడిని ఎదుర్కొనలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఏటా దేశంలో లక్షన్నర మంది ఆత్మహత్యలకు గురై అర్థాంతరంగా తనువు చాలిస్తున్నారని చెప్పారు. ఆత్మహత్యలు చేసుకోవటానికి కూడా ధైర్యం కావాలన్నారు. ఆ ధైర్యాన్ని సమస్యలను ఎదుర్కోవటానికి ఉపయోగించి ఆశతో ముందడుగు వేస్తే మంచి విజయాలు సొంతమవుతాయని వివరించారు. మానసిక సమస్యలు, కారణాలు, ఆత్మహత్యలు తదితర సమస్యలకు సంబంధించి వైద్య పరిభాషలో పలు శాస్త్రీయ పేర్లు ఉన్నా యువత ఎక్కువగా ఈ సమస్యలకు గురవుతున్న విషయాలను సర్వేలు తెలియజేస్తున్నాయని తెలిపారు. డిజిటల్ ఎడిక్షన్ సమస్యలు ఇటీవల అధికమయ్యాయన్నారు. ఎంతో కోల్పోయామనే భావనను చుట్టుపక్కల వ్యక్తుల వద్ద వ్యక్తం చేస్తారని తెలిపారు. అటువంటి వ్యక్తులు తారసపడినప్పుడు వారికి ఆత్మస్థైర్యాన్ని కలిగించాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ యువత ఇలాంటి చర్యల ద్వారా వారు తమ వ్యక్తిగత జీవితాన్ని బలి చేసుకోవటమే కాకుండా కుటుంబానికి తీరని వ్యథను మిగుల్చుతున్నారన్నారు. ఒత్తిడిని అధిగమించడానికి ఇతర మార్గాలను అన్వేషించాలుగానీ ఆత్మహత్యకు పాల్పడవద్దని సూచించారు. యువతలో గొప్ప శక్తియుక్తులు ఉన్నాయని, వాటిని వినియోగించుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ టి.భాగ్యకుమార్, ఎన్ఎస్ఎస్ యూనిట్ పీవో వీఎస్‌రావు స్వాగతం పలకగా, మరో పీవో ఎస్.సాంబశివరావు వందన సమర్పణ చేశారు.

ఫుట్‌బ్రిడ్జిపై వీధి దీపాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా ఉండే మధురానగర్ ఫుట్‌బ్రిడ్జిపై వీధి దీపాలను ఆదివారం ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఏర్పాటు చేయించారు. ఇటీవల మధురానగర్ వచ్చిన సందర్భంగా ఫుట్‌బ్రిడ్జి వద్ద చీకటిగా ఉండటంతో రాకపోకలకు ప్రజలు అవస్థలు పడటాన్ని ఎమ్మెల్యే గమనించారు. అధికారులతో మాట్లాడి సత్వరమే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. మల్లాది విష్ణు ఆదేశాల మేరకు రెండు వీధీ దీపాలు ఏర్పాటు చేశారు.

రూ. 5.5 కోట్లతో పప్పులమిల్లు వద్ద వంతెన

స్థానిక అవసరాలు రద్దీ నివారణకు మధురానగర్ పప్పులమిల్లు సెంటర్ వద్ద వంతెన నిర్మాణ పనులకు రూ. 5.5 కోట్లను ఎమ్మెల్యే మల్లాది విష్ణు మంజూరు చేయించారు. త్వరలోనే టెండర్లు పిలిచి వంతెన పనులు ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.



మధురానగర్ ఫుటబ్రిడ్జి వద్ద వీధి దీపాలు

అర్హతే ప్రామాణికంగా పింఛన్లు

నందిగామ: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్ అందుతుందని కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవి శంకర్ అన్నారు. మండలంలోని మాగల్లు గ్రామంలో నూతనంగా మంజూరైన 15 మందికి పింఛన్లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవి శంకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ లో పింఛన్ మంజూరు కావాలంటే ఎన్నో ఇబ్బందులు పడాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం పింఛన్ లను పంపిణీ చేస్తుందన్నారు. అదేవిధంగా నవరత్నాల పేరుతో పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాగల్లు గ్రామంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్

ముత్యాలమ్మకు బోనాలు



జలబిందెలతో వెళ్తున్న మహిళలు

మంగొల్లు(వత్సవాయి): శ్రావణమాసాన్ని పురస్కరించుకుని గ్రామంలోని ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు బోనాలను సమర్పించారు. ఉదయాన్నే భక్తులందరూ జలబిందెలలో పసుపునీళ్లు నింపుకుని పూలమాలలతో అలంకరించుకుని ఊరేగింపుగా అమ్మవారి దగ్గరకు వెళ్లి బోనాలు సమర్పించారు. పెద్ద సంఖ్యలో అమ్మవారికి భక్తులు బోనాలను సమర్పించి పాడిపంటలతో కళకళలాడాలని మొక్కులు తీర్చుకున్నారు.

సందడిగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

40 ఏళ్లకు కలిసిన ఎస్ఏఎస్ కాలేజ్ 1981–84 బీకాం విద్యార్థులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సయ్యద్ అప్పలస్వామి కళాశాల బీకాం 1981–84 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం సందడిగా జరిగింది. నాలుగు దశాబ్దాల తరువాత సీనియర్ సిటిజన్స్ అయ్యాక ఇప్పుడు వారంతా కలిసి గత స్మృతులను పంచుకున్న క్షణాలు కళాశాల ప్రాంగణంలో మధురానుభూతులను పంచాయి. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి స్మృతులను తలచుకుని ఆనందపరవశులయ్యారు. పూర్వ అధ్యాపకులకు గౌరవభావంతో నమస్కరించి ఆశీస్సులందుకున్నారు. ముఖ్యఅతిథి స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పూర్వ విద్యార్థులను, పూర్వ అధ్యాపకులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం కన్వీనర్లు వసంత్‌కుమార్, ఎన్వీరావు, పూర్వ అధ్యాపకుడు ఎ.లోకాభిరామయ్య, అధ్యాపకులు కేవీ శ్యామ్‌సుందర్, వీవీ సుబ్బారావు, కేఎల్ నరసింహారావు, పి.శివరామప్రసాద్, సోమసుందరావు, విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



ఆలయంలో స్వామి వారికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే

నందిగామ(చందర్లపాడు): మండలంలోని పొక్కునూరు గ్రామంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉరుసు మహోత్సవం ప్రారంభం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజంలో సుఖ శాంతులు వర్ధిల్లాలంటే వలి అల్లా చల్లని దీవెనలు అవసరమని సూఫీ పండితుడు సయ్యద్ నజీరుద్దీన్ బాబా పేర్కొన్నారు. పాతబస్తీ పంజా సెంటర్‌లోని హజరత్ సయ్యద్ షా మస్తాన్ వలి రెహమతుల్ ఆలై లోటే సోటె వాలే బాబా 102వ ఉరుసు మహోత్సవం ఆదివారరం ప్రారంభమైంది. నజీర్‌ఉద్దీన్ దర్గా ముజావర్ల సన్మానం అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ దేశంలోని అనేక నగరాల్లో వలి అల్లా దర్గాలు సర్వమానవ సౌభ్రాతృత్వానికి ప్రతీకలన్నారు. పాతబస్తీలోని హజరత్ సయ్యద్ షా మస్తాన్ వలి రెహమతుల్ ఆలై లోటే సోటె వాలే బాబా అనేక అద్భుతాలు ఆవిష్కరిస్తూ అందరి కోర్కెలను అల్లాహ్ అనుగ్రహంతో నెరవేరుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో దర్గా ముజావర్లు బాబు, షమి, జిలానీ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



దర్గాను దర్శించుకున్న సూఫీ పండితులు సయ్యద్ నజీరుద్దీన్

భారీ వర్షంతో కూలిన గోడ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భారీ వర్షంతో కేఎల్‌రావు పార్కులో ప్రహరీ కూలిపోయింది. కేఎల్‌రావు పార్కు లోపల తూర్పు వైపున కొన్ని ప్రయివేటు భవనాలు ఉన్నాయి. ఆయా భవనాల ప్రహరీ గోడలు పార్కు లోపల వైపు ఉన్నాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకుతోడు శనివారం రాత్రి 11 గంటలకు కురిసిన భారీ వర్షంతో ప్రహరీ కూలి పార్కు లోపల వాకింగ్ ట్రాక్‌పై పడింది. ఘటనలో ఎవరికీ ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. కార్పొరేషన్ సిబ్బంది వెంటనే ప్రహరీ శిథిలాలను తొలగించి వాకర్లకు ఇబ్బంది కలుగకుండా చూడాలని కోరుతున్నారు.



వాకింగ్‌ట్రాక్‌పై కూలిన ప్రహరీ

ఘనంగా కల్యాణ సాయిబాబా మందిరం వార్షికోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): చుట్టుగుంట శ్రీ కల్యాణ షిరిడీ సాయిబాబా మందిరంలో ఆదివారం మందిర వార్షికోత్సవం ఘనంగా జరిగాయి. బాబాకు విశేషంగా పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు అర్చనలు, అన్నాభిషేకం చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని బాబాను దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం పల్లకీ సేవ జరిగింది. కార్యక్రమాలను మందిర వ్యవస్థాపకుడు పగడాల మధుసూదనరావు పర్యవేక్షించారు.



కల్యాణ సాయిబాబా మందిరంలో అన్నదానం